క్లుప్తంగా

కమనీయం.. రాములోరి కల్యాణం



స్వాముల వారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామం బైరెడ్డి నగర్ వీరాంజనేయస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం శుక్రవారం ఆలయ అర్చకులు జంధ్యాల మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో కనులపండుగలా నిర్వహించారు. స్వామి తరపున సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, శివకేవతులశమ్మ, అమ్మవారి తరపున చంద్ర పెద్దస్వామి, చంద్ర గోవర్ధనమ్మ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణ దాతలుగా వ్యవహరించారు. అనంతరం అర్చకులు మనోహర్‌శర్మ శాస్త్రోక్తంగా ఆదిదంపతులకు కల్యాణం జరిపించారు. వేడుకలను తిలకించేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ముగిసిన శ్రీరామనవమి

పాణ్యం: శ్రీరామనవమి పండుగ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. మండల కేంద్రమైన పాణ్యంలోని దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలు గ్రామోత్సవంతో ముగిశాయి. మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు, సిబ్బంది ఊరేగింపులో పాల్గొన్నారు.

- వాల్మీకి మహర్షి ఆలయం వద్ద నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్ పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

గడివేముల: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీడీఓ విజయసింహారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తాగునీటి సమస్యఉన్న గ్రామాలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసులకు శుక్రవారం 940 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న అధికారులు

సి.బెళగల్: విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ రాముడు వలంటీర్లకు సూచించారు. శుక్రవారం ఆయన నూతనంగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, సూపరింటెండెంట్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తరించాలి



మాట్లాడుతున్న మిద్దె శివరామ్

పాణ్యం: ప్రతి గ్రామంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సేవలు విస్తరించాలని ఆర్‌జీఎం సంస్థల డైరెక్టర్ మిద్దె శివరామ్ సూచించారు. పాణ్యం వాసుల అవసరం కోసం మిద్దె శివరామ్ రూ. 3,50,000,మాజీ సర్పంచ్ పుల్లయ్య రూ. 1,20,000 నగదు విరాళంతో తయారు చేయించిన వైకుంఠ రథాన్ని శుక్రవారం వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మిద్దె శివరామ్ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని శ్మశానానికి తరలించేందుకు ఇబ్బంది పడకుండా వైకుంఠరథాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

కోడుమూరు రూరల్: వలంటీర్లు ప్రజలకు సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి సూచించారు. నూతనంగా ఎంపికైన ఆరుగురు వలంటీర్లకు శుక్రవారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి ఆయన నియామక పత్రాలు అందజేశారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి

పాణ్యం: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని ఆర్‌ఐ మహేశ్వరరెడ్డికి శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, కార్తీక్, వంశీ, మహీంద్రా, జయంత్, వీరేంద్ర తదితరులు వినతిపత్రం అందించారు. సొంత భవనం లేక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు.

వలంటీర్ల సేవలు భేష్

గ్రామ వలంటీర్ వ్యవస్థ అన్ని వర్గాల నుంచి మన్ననలు పొందుతోంది. కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడంలో తలలో నాలుకలా వ్యవహరిస్తున్న వలంటీర్లపై ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. తమకు అప్పగించిన కుటుంబాలకు ఎప్పటికప్పుడు పథకాల సమాచారాన్ని చేరవేస్తూ.. సంక్షేమ ఫలాలు అందుకునేలా వలంటీర్లు సాయపడుతున్నారు.

– గడివేముల



తిరుపాడులో వృద్ధురాలు బాలేశ్వరమ్మ ఐరిస్ సేకరిస్తున్న వలంటీరు శ్రీనివాసులు (ఫైల్)



హైదరాబాదు అపోలా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెసరవాయి లక్ష్మీదేవమ్మకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీరు వెంకటసుబ్బడు (ఫైల్)

- సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరవేత
- మన్ననలు పొందుతున్న వలంటీర్లు

వలంటీర్ వ్యవస్థ అత్యున్నత సేవలతో ప్రజల మన్ననలు పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా వలంటీర్లు పని చేస్తున్నారు. ఈ వ్యవస్థ ఏర్పడి మూడేళ్లు పూర్తి చేసుకుని నాలుగో ఏడాదిలోకి ప్రవేశించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఆగస్టు 15న వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇంత తక్కువ కాలంలోనే ఇతర రాష్ట్రాలను సైతం ఆకర్షించింది. మండలంలో 14 గ్రామ సచివాలయాల్లో 228 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించి దరఖాస్తు చేయిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని సైతం అడిగిన వెంటనే ఇచ్చేస్తున్నారు. బాగా పనిచేసిన వలంటీర్లను ప్రతి ఉగాదికి సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించి ప్రభుత్వం సత్కరించి మరింత ప్రోత్సహిస్తోంది.

సకాలంలో పింఛన్..

గ్రామ వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక ప్రతినెల ఒకటో తేదీన తెల్లవారక ముందే పంపిణీ పూర్తి చేస్తున్నారు. అనారోగ్య పరిస్థితుల రీత్యా ఆస్పత్రుల్లో ఉన్న వారికి కూడా కొందరు వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్మును అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి అర్హులైన వారిని గుర్తించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలను గుర్తించి దరఖాస్తు చేయిస్తున్నారు.

సంతృప్తినిస్తుంది



గ్రామంలోనే ఉంటూ పనిచేసే అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. నాకు కేటాయించిన కుటుంబాలకు ప్రతి పథకం గురించి తెలియజేస్తూ అర్హులైతే దరఖాస్తు చేయిస్తున్నాను. నా పరిధిలోని 50 కుటుంబాలకు సేవలందిస్తున్నా. వారు నన్ను కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తుండటంతో ఎంతో సంతృప్తినిస్తోంది.

– గరిటగారి పెద్దరాజు, గడివేముల వలంటీర్

సంతోషంగా ఉంది



నా పరిధిలో ఉన్న కుటుంబాలకు సేవలు అందించడం సంతోషంగా ఉంది. బాగా పనిచేసిన వలంటీర్లను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందించడంతో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నాం. ప్రతి నెల తెల్లవారుజామునే పింఛన్లు అందించడంతో లబ్ధిదారులు ఎంతో సంతోష పడుతున్నారు.

– రమాదేవి, బూజునూరు గ్రామ వలంటీర్

బహుమతుల పంపిణీ



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీల వ విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా రెండు రోజులుగా జరిగిన కబడ్డీ పోటీల్లో విజయవాడ జట్టు మొదటి స్థానం కైవసం చేసుకోగా, గొందిపర్ల జట్టు రెండో స్థానం దక్కించుకుంది. అలాగే మూడు, నాలుగు స్థానాల్లో నెల్లూరు, పంచలింగాల ఏబీఎం జట్లు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను కర్నూలు కబడ్డీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అవుల గోపాల్, పంచలింగాల కృష్ణారెడ్డి, గొందిపర్ల సుంకిరెడ్డి, వార్డు మెంబర్ సుధాకర్ అందజేశారు.

నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్: రైతులకు నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎరువుల గోడౌన్‌లలో తనిఖీలను చేపట్టారు. కోర మండల్ ఎరువుల గోడౌన్‌లో నిల్వలు, రికార్డులను పరిశీలించారు.



చెక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వీకర్‌సెక్షన్ కాలనీలో కల్లూరు అర్బన్ 36, 37, 41వ వార్డులకు చెందిన 258 పొదుపు సంఘాల మహిళలకు రూ.1.34 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు జీవనోపాధులను మెరుగు పరుచుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. 2019 ఏప్రిల్ నాటికి బ్యాంకుల్లో ఎంత రుణం ఉంటే అంత నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం ప్రవేశపెట్టి ఇప్పటికే రెండు విడతల్లో రుణాలను మాఫీ చేశామన్నారు. ప్రస్తుతం మూడో విడత రుణాలను మాఫీ చేస్తున్నామన్నారు. చెక్కుల పంపిణీ అనంతరం సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు ఆయిషా సిద్దిఖా, శ్వేతారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎ.హనుమంతురెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంగులు, ప్రతాప్‌రెడ్డి, షరీఫ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న మహిళలు

కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్థానిక బైరెడ్డి నగర్‌లో గల వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద జరిగిన పోటీలను స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో మొత్తం 20 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన జట్లకు తొలి నాలుగు స్థానాలకు గాను వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున బహుమతులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రఘు, వైఎస్సార్‌సీపీ సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, కాల్వబుగ్గ ట్రస్టు బోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ చాంద్‌బాషా, నాయకులు చంద్ర పెద్దస్వామి, జికె వెంగన్న, మద్దిలేటి, రంగడు, సుదీర్‌కుమార్ పాల్గొన్నారు.

నన్నూరులో బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: శ్రీరామనవమి సందర్భంగా నన్నూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దులు బండలాగుడు పోటీలు రసవత్తరంగా జరిగాయి. 15 జతలు ఎద్దులు పోటీలో పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి 10 స్థానాల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.80వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని శివనరసంహిరెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం లక్ష్మీపురం ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం





పొదుపు మహిళలకు మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం ఎల్ఎల్‌సీ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని మండలంలోని 924 పొదుపు గ్రూపులకు మంజూరైన రూ.4,85,09,632ల చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, ఇళ్ల పట్టాలు మహిళలకే అందజేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల వద్దకే చేర్చారన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా సీఎం జగన్ బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమవుతుందన్నారు. కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.200 కోట్ల నిధులను ఖర్చు చేసిందన్నారు. 70 ఏళ్ల కలగా ఉన్న గోరంట్ల–కొత్తపల్లె బ్రిడ్జిని ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటున్న జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని మహిళలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత అమడగుంట్ల క్రిష్టారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎం పుష్పావతి, ఏఓ రవిప్రకాష్, సర్పంచు మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఇందివరప్రభ, తిరుపతయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కలిసికట్టుగా పనిచేసి కోడుమూరు నియోజకవర్గంలో మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరేద్దామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సూచించారు. శుక్రవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో సచివాలయాల జోనల్, మండల కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని తెలియజేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారితో కాసేపు మాట్లాడాలన్నారు. పథకాల కోసం టీడీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులను, మన ప్రభుత్వంలో సులభంగా పొందుతున్న లబ్ధిని గుర్తు చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్న విషయాన్ని వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరాలన్నారు. అనంతరం ఫిష్ ఆంధ్ర మొబైల్ వాహనాలను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఎంసీ సభ్యులు రవిశాస్త్రి, గూడూరు ఎంపీపీ బొంతల మునెప్ప, కర్నూలు వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మౌలాలి, వ్యవసాయ సలహామండలి మండల అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు వినయ్‌కుమార్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, సచివాలయ జోనల్, మండల కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్, శేఖర్, భాస్కర్, మోహన్‌బాబు, తులసిరెడ్డి, ఎల్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, గూడూరు మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాం, లాయర్ ప్రభాకర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానియేలు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మొక్క జొన్న పంట దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ రైతు బోరుకంటి మహీంద్ర మొక్కజొన్న పంట దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు.. రైతు మహీంద్ర ఐదెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. దిగుబడులు చేతికి వచ్చే సమయంలో శుక్రవారం పంటకు నిప్పు అంటుకుంది. ఆర్పేందుకు యత్నించగా వీలుకాకపోవడంతో నంద్యాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పంట పూర్తిగా కాలిపోయింది. కాగా మంటలు ఎలా అంటుకున్నాయనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి



చనుగొండ్లలో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కోడుమూరు రూరల్/గూడూరు రూరల్: పది పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి సూచించారు. శుక్రవారం కోడుమూరు మండలం లద్దగిరి, గూడూరు మండలం చనుగొండ్ల హైస్కూళ్లను డీఈఓ డా.వి.రంగారెడ్డి తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం పదవతరగతి విద్యార్థులతో డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పది విద్యార్థులకు ప్రభుత్వం పబ్లిక్ పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించే విధంగా అన్ని రకాల సదుపాయలను కల్పిస్తోందని,వెనుకబడిన విద్యార్థుల కోసం విజయదీపిక పుస్తకాలను అందజేసిందని తెలిపారు. ప్రతి విద్యార్థి పరీక్షల పట్ల భయం వీడి చక్కగా చదువుకుని అధిక మార్కులు సాధించాలని డీఈఓ సూచించారు. ఆయన వెంట ఉర్దూ డీఐ ఆదాంబాషా, హెచ్ఎంలు రామచంద్రారెడ్డి,దూల్ సాహెబ్ ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కల్లూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తుగ్గలి మండలం పెండేకల్లు గ్రామానికి చెందిన బార్సా పదయ్య(38) రెండు రోజుల క్రితం తుగ్గలి నుంచి రైలులో వచ్చి దూపాడు స్టేషన్‌లో దిగాడు. కర్నూలు నగర శివారులోని తిరుమలగిరి టౌన్‌షిప్‌కు బంధువుల బైక్‌లో బయలుదేరాడు. 44 జాతీయ రహదారిపై అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ కోలుకోలేక గురువారం సాయంత్రం మృతి చెందాడని ఎస్ఐ నల్లప్ప చెప్పారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడొద్దు

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కల్లూరు: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడొద్దని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ ఆవరణలో జరిగిన సామాజిక బహిరంగ తనిఖీ సమావేశం నిర్వహించారు. పీడీతోపాటు జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సిద్దలింగమూర్తి, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, పంచాయత్ రాజ్ ఏఈ అచ్యుతానందరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సామాజిక తనిఖీ బృందం, ఉపాధి ఏపీఓ మద్దేశ్వర్మ, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులపై బహిరంగ తనిఖీ నిర్వహించారు. రూ.7.75 కోట్ల పనులు జరిగాయి. అందుల్లో రూ.4.55 కోట్లు మెటీరియల్, రూ.3.20 కోట్లు కూలీలకు ఖర్చు చేశారు. రూ.2,04,180 అవినీతికి పాల్పడినట్లు గుర్తించి పది హేను రోజుల్లో రికవరీ చేయాలని సంబంధిత అధికారులను పీడీ ఆదేశించారు.

చెత్తసేకరణ కేంద్రాలను వినియోగించాలి

- డీపీఓ నాగరాజు నాయుడు



బ్రాహ్మణదొడ్డిలో చెత్తసేకరణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

సి.బెళగల్: గ్రామ పంచాయతీలో ఏర్పాటైన చెత్తసేకరణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీపీఓ నాగరాజు నాయుడు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాల్లో పర్యటించి చెత్తసేకరణ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించి చెత్తసేకరణ కేంద్రాల పురోగతిపై చర్చించారు. మండలంలో 11 గ్రామ పంచాయతీలలో చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలు పూర్తవగా, ఎనిమిది గ్రామాలలో వర్మీకాంపోస్టుతో పాటు పూర్తి స్థాయిలో వినియోగంలో ఉన్నాయని, మరో ఆరు గ్రామ పంచాయతీలలో నిర్మాణాలు వివిధ దశాలలో ఉన్నాయని, పోలకల్ గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ కేంద్ర నిర్మాణం ఇంతవరకు పూర్తి కాలేదని డీపీఓకు ఎంపీడీఓ వివరించారు. డీపీఓ వెంట ఈఓఆర్డీ సందీప్ ఉన్నారు.